
# ఇంద్రధనస్సు

శ్యామల



కనకాంబరం రంగుపూలు ఉన్న తెల్లని జార్జెట్ చీర ధరించి లాన్‌లో పూల మొక్కలవద్ద కూర్చొని ట్రాన్సిస్టర్ వింటున్న రత్నను చూస్తుంటే మనస్సెంతో హాయిగా అనిపించింది కుసుమకి. రేడియో పాటతో పాటు కూనిరాగాలు తీస్తున్న రత్న అక్క రాకని గమనించలేదు.

"యెలుతురంతా మేసి యేరు నెమరేసింది
కలవరపు నాబతుకు కలతనిదరయ్యిందీ—"

"రత్నా! కాఫీ"

"థాంక్స్, అక్కా" కాఫీకప్ అందుకుంటూ అన్నది రత్న "ఈ పాట వింటుంటే నీ జీవితాన్నిగురించే రాసినట్టుంది!"

నవ్వింది కుసుమ— "నాసంగతికేమిలే కాని, నీ జీవితం ఎలా ఉంటుందా అని ఆలోచిస్తున్నాను నేను. ఈ గారాల చెల్లిని ఎంత గారాబంగా చూసుకొనే మొగుడు రావాలో—ఈ రత్నం ఎవరి జీవితాన్ని అలంకరించాలో—అప్పుడు మా వంటివాళ్ళం అసలు జ్ఞాపకం వస్తామా—" అల్లరిగా అన్నది.

"పో అక్కా!" సిగ్గుపడింది రత్న. అంతలోనే ఆమె దృష్టి దూరంగా—మబ్బులతో నిండిన ఆకాశంలో మూలగా సప్త వర్ణాలలో మెరుస్తున్న ఇంద్ర ధనస్సుపై పడింది "అటువైపు చూడు, ఎంత అందంగా ఉందో! ఇంద్ర ధనస్సుని చేతో తాకాలని, ముద్దు పెట్టుకోవాలనీ అనిపించటం లేదూ—!?"

"జీవితమే ఓ రంగుల చక్రం కదూ?" చిన్నగా అన్నది కుసుమ.

రేడియోలో పాట సాగిపోతూనే ఉన్నది—
"ఒక్కతెను నాకేల ఓపజాలని ఈసుకము."

"అక్కయ్య గురించే రాశారు ఈ పాట" మూడ్ మారిపోగా బాధగా అనుకుంది రత్న, బొట్టులేని కుసుమ ముఖాన్ని చూస్తూ.

రిటైర్డ్ జడ్జి కేశవరావుగారి అమ్మాయిలు వాళ్ళిద్దరూ. కుసుమని చూడగానే అందగత్తె అని ఎవరూ అనలేరు. సన్నగా, పొడుగ్గా చామనచాయలో అతి సామాన్యంగా ఉంటుంది ఆమె. ఆమెలో ఆకర్షణీయమైనవి ఆమెకళ్ళు మాత్రమే. మనసులోని భావాలన్నిటినీ అద్దాలవలె ప్రతిఫలింపజేస్తూ, ఏదో అపురూపమైన వెలుగుతో నిండిన ఆ విశాల నేత్రాలనిచూసిన వారు ఎవరయినా "చెప్పుకోదగిన అందం లేకున్నా ఈమె ముఖంలో మంచి కళ ఉంది" అనక మానరు. రత్న అక్కకన్నా కాస్త పొట్టి. చక్కని కనుముక్కు తీరుతో అందంగా ఉండే రత్న ఒక చైతన్యస్రవంతి. సదా సంతోషంతో, ఏవేవో ఊహాలతో, ఆశలతో జీవితాన్ని ఒక బంగారు స్వప్నంగా భావించే ఆమె గంతులేసే లేడి పిల్లని జ్ఞప్తికి తెస్తుంది.

"వంశీ దగ్గర్నించి ఉత్తరం వచ్చింది!" అంటూ అక్కడికి వచ్చారు కేశవరావుగారు కుసుమచేతికి కవరు సందిస్తూ— "త్వరలో

వస్తాడట" అన్నారు ఆత్రంగా, ఆనందంగా, అంటూనే ఇంటిలోనికి వెళ్ళారు భార్యకి ఆ వార్త చేరవేయటానికి

కేశవరావుగారి ఆప్తమిత్రుడు నారాయణ గారి ఏకైక పుత్రుడు వంశీమోహన్. కోరుకొండ సైనిక స్కూల్‌లో అతడు చదువుతూండగా తండ్రి హఠాత్తుగా మరణిస్తే కేశవరావు గారు దగ్గరకు తీశారు. బంధువర్గాన్నంతా వదిలి ఆస్తిపాస్తుల బాధ్యతను, కొడుకు సంరక్షణ భారాన్ని స్నేహితుడు కేశవరావుగారిపై వదిలారు నారాయణగారు. పెద్దవాడై సైన్యంలో పనిచేస్తున్న వంశీ మోహన్ వీళ్ల కుటుంబసభ్యుడుగానే మసులుతూ శలవలకు ఇక్కడికే వస్తూ ఉంటాడు. అతనికి, కేశవరావుగారికీ మధ్యనున్న బంధం చిత్రమైనది. వయస్సులలో తారతమ్యం చాలా ఉన్నా ఆప్తమిత్రులవలె సంచరిస్తూంటారు.

కవరులోనించి ఉత్తరం వెలుపలికి తీసింది కుసుమ. వంశీ ఉత్తరాలంటే ఆమెకు చాలా యిష్టం. ఏ కారణం వలననో కాని జీవితం పట్ల వంశీ దృక్పథం విషాదంతో, నిరాశావాదంతో నిండి ఉంటుంది. అందరికీ ఆనందం కలిగించే అతనికి అర్థం లేనివిగా తోస్తాయి. పిక్నిక్‌లు, సినిమాలు, సిగరెట్లు, సరదాలు— అతనికి ఎన్నడూ లేవు. సాధారణంగా ఏ యువకుడిలోను అగుపించని భారం అతని ఆలోచనల్లో ఉన్నది. ఏదో విషాదపు పొర అతని జీవితాన్ని సదా క్రమ్మి ఉంటుంది. ఏదో కారణంగా అతడికి అలవడిన విషాదం, కుసుమకి జీవితంలోని అనుభవాల వలన ఎదురయింది. రెండు సంవత్సరాల క్రితం ఇంజనీరుగా పనిచేస్తున్న రాజారావుతో ఆమె వివాహం అయింది. ఎన్నో సంబంధాలు చూసి, చివరికి కేశవరావుగారికి అన్నివిధాలా నచ్చి ఎంతో సంతోషంతో జరిపిన శుభకార్యం అది. పెళ్ళినాటి రాత్రి రాజారావు కారులో విడిదికి తిరిగి వస్తూండగా, కారు రోడ్డు ప్రక్కనఉన్న పెద్ద చెట్టుకి ఢీకొన్నది. డ్రైవరు కొద్ది గాయాలతో బ్రతికి బయట పడినాడు కాని, రాజారావు అప్పటికప్పుడే మరణించాడు.

కుసుమ ఉత్తరం చదవసాగింది.

"ప్రియమైన మామయ్యకి,

బంగ్లాదేశ్‌లో పాక్‌సేనలు మనకి లొంగిపోయినాయి! మనమిప్పుడు విజేతలం!

కాని ఈవార్త నాకు ఉప్పొంగే ఆనందాన్ని కలిగించటం లేదంటే నమ్ముతావా? అలాగని దుఃఖాన్నీ కలిగించటం లేదు!

రాత్రిపూట వెచ్చని మంటవద్ద, మరింత వెచ్చని రగ్గు కప్పుకుని పడుకున్నప్పుడు— డేరా కంతల్లోనించి కనిపిస్తున్న నక్షత్రాలు నిండిన ఆకాశాన్ని చూసినపుడు - ఇంకా ఒంటరిగా ఉన్న మరెన్నో సమయాల్లో—నాకు ఎదురయ్యేది ఒకటే ప్రశ్న—

'వంశీమోహన్! నీవు ఇక్కడ ఎందుకు ఉన్నావు?'

నాకు ఎవరిపట్లా ద్వేషం లేదు. పాక్ సైనికులను చంపాలని కోరికలేదు. ఎవరిపైనయినా కాల్పులు జరపవలసి వచ్చినప్పుడు, 'ఇతనుకాని, ఇతని తలిదండ్రులుకాని, ఇతని భార్యాపిల్లలుకాని నాకేమీ హాని చేయలేదే? ఇతనిని నేనెందుకు చంపాలి? వారినందరినీ ఎందుకు బాధించాలి?' అనిపించి మనసు వికలమవుతుంది. కాని అతను మరో దేశానికి చెందినవాడు: నేను ఈ దేశానికి చెందినవాడిని. నా దేశం, ఆ దేశం ప్రస్తుతం శత్రువులు. కనుక అతన్ని నేను చంపాలి; తప్పదు! ఏమిటిదంతా? ఎవరు సృష్టించారు ఈ శత్రుత్వాన్ని? మనిషికీ, మనిషికీ ఎందుకీ విభేదాలు? దేశానికి, దేశానికి ఎందుకీ భేదాభిప్రాయాలు? దేనికి ఈ రక్తపాతం, ఈ హింస? దేనికోసం ఇదంతా??

అన్నీ ప్రశ్నలే! వేటికీ సమాధానం తెలియదు!

పక్కనే హాయిగానిదురిస్తున్న నామిత్రుడు సిక్కు సైనికున్ని చూస్తే, ఇతనికి ఇన్ని ఆలోచనలు లేవేమిటనిపిస్తుంది! అతనికి శత్రువుని ఓడించాలనే తీవ్రకాంక్ష ఉంది. తాను జయించాలనే కోరిక ఉంది. కీర్తి పొందాలనే ఆశఉంది.

నాకు ఏవీలేవు! గెలుపు, ఓటమి...వీటికి అర్థమేలేదు!

నాది నిరాశావాదం అని నాకు తెలుసు. జీవితానికే అర్థంలేదని నేనంటే నా మిత్రులు నవ్వుతున్నారు. 'నీకు ఇంకా వివాహం కాలేదు భాయ్! అందుకే ఇలా మాట్లాడుతున్నావు. నీవే కావాలనుకొనే స్త్రీ నీకు తోడుగా జీవితంలో ప్రవేశించినపుడు, నీవారు అనుకోవటానికి పిల్లలు కలిగినపుడు ఇలా మాట్లాడవు!' అంటున్నారు. వారు చెప్పేదీ నిజమేనేమో!

ఏమైతేనేమి-యుద్ధం ముగిసింది. రక్తపాతం, కన్నీళ్లు ఆగాయి.

ఇంకొక నెలరోజుల్లో ఇంటికి వస్తున్నాను.

కుసుమని, రత్నని అడిగానని చెప్పు. నీకు, అత్తయ్యకి నమస్కారాలు.

— వంశీ మోహన్.

ఉత్తరం సగంలో ఉండగానే రత్న చెవులు కుసుమ స్వరాన్ని వింటున్నా, మనస్సు అందులోని విషయాలు వినటం మానివేసింది. ఆమెకి వంశీ అంటే ఎంతో ఇష్టం. సినిమా హీరో జుట్టులాగా నుదుటిమీదపడే అతని జుట్టంటే మరీ ఇష్టం. తన వైపే చూస్తున్నా, తననిదాటి ఎక్కడో చూస్తున్నట్లుండే అతనికళ్లు, బరువైన అతని స్వరం ఇంకా ఎంతో ఇష్టం. కానీ ఉత్తరాలు మాత్రం కాస్త బోరే...అనుకుంది. గడ్డిపై వెనక్కివాలి రేడియో ఆపుజేసింది. అయినా ముత్యాలకోవవంటి ఆ దస్తూరి తనకి మహాప్రీతి. "ఇంకొక నెల రోజుల్లో వస్తాడట" అన్న తండ్రి మాటలు తలచుకొంటుంటే తెలియని ఆనందంతో నిండిపోయింది మనసంతా. క్రితంసారి వచ్చినపుడు — నాలుగు సంవత్సరాల క్రితం — సరిగ్గా పదిరోజులే ఉన్నాడు. తను స్కూల్‌ఫైనల్ పరీక్షలు రాసి ఫలితాల కొరకు ఎదురుచూస్తున్న సమయం అది. మిలిటరీ దుస్తులలో గేటు

## కొన్ని కోరికలు !

ఇవ్వండి మాకో నిచ్చెన
మూడంతస్తుల మేడనెక్కేందుకు కాదు,
ఆకాశాన్నంటే ధరల నందుకొనేందుకు.
ఇవ్వండి మాకు మంచి ట్రీట్‌మెంట్.
మలేరియా వచ్చిందని కాదు.
మానవత్వము మరిచిపోతున్నందుకు.
యివ్వండి మాకో తుపాకి.
మనుషులను చంపేందుక్కాదు.
మనసులలో మతభేదాలను కాల్చేందుకు.
మసలుకోండి ఐక్యతతో,
పరదేశాన్ని పాలించేందుక్కాదు.
అవినీతిని పెంచేందుక్కాదు.
మానవత్వము నిల్పేందుకు.
మంచిని పెంచేందుకు.

—శేఖర్ మరియు హరి

# ఇంద్ర ధనస్సు

వద్ద జీపుదిగి హుందాగా లోనికి నడిచి వస్తుంటే చూసింది బాల్కనీ లోనించి. అంతే.. తన మనసు పారవేసుకుంది ఆ క్షణం లోనే. నవ్వుతూ తలచుకుంది ఆ దృశ్యాన్ని.

ఉత్తరం చదవటం పూర్తిచేసిన కుసుమ రత్నని చూసి, కెంపుల్లా మెరిసిపోతున్న ఆమె చెక్కిళ్లని గమనించి వాటిభావం అర్థం చేసుకుంది. అమ్మకి, నాన్నకి కూడా ఉన్నది ఈ ఉద్దేశమే. తన ముద్దుల చెల్లి, ప్రియ స్నేహితుడు భార్యాభర్తలు కావటం కన్న కావలసినదేముంది? వంశీ ఈసారి శలవ ఎన్నాళ్ళు పెట్టాడో! పెళ్ళి చేసుకొని వెళ్తే బాగుండును! అసలు అతని మనసులో ఏముందో !? అయినా రత్నని కాదనే మూర్ఖుడు ఉండడు ఎక్కడా. చెల్లి మనసు లోని కోరిక తీరేందుకు తను శాయశక్తులా ప్రయత్నించాలి — వంశీ! నీకు ఏంతక్కువని ఎప్పుడూ బాధగా ఉంటావు? మా రత్న తన చలాకీతనంతో నీకు జీవితంలో హుషారు కలిగిస్తుందిలే!

*      *      *

వంశీ మోహన్ అరుదెంచే రోజు దగ్గరైంది. కేశవరావుగారి భార్య సుందరమ్మగారు హడావిడిపడుతూ గదులన్నీ సర్దిస్తున్నారు. ఈసారి అతనితో పెళ్లి విషయం కదపాలని, రత్నని చేసుకోమని అడగాలని ఆవిడ ఆలోచన. రత్న బి. ఎ. ఈ సంవత్సరంతో పూర్తయింది. పెద్దపిల్లకి రెండేళ్లనాడు పెళ్లి చేస్తే దాని బ్రతుకలా మోడులా అయింది. కుసుమని ఇరవైఏళ్ళ లేత వయస్సులో వితంతువుగా చూస్తుంటే ఆవిడ కడుపు తరుక్కుపోతూంటుంది. మళ్లీ రత్న పెళ్ళి — ఇంట్లో శుభకార్యం అనుకుంటేనే ఆవిడ గుండెలో దడగా అనిపిస్తున్నది. అయినా చేయగలిగేదేమున్నది? పుట్టిందే ఇద్దరు పిల్లలు ... వాళ్ళే రెండు కళ్ళుగా పెంచుకు వచ్చారు—పిల్లల్ని కన్నాను కాని వాళ్ల రాతల్ని కన్నానా—అనుకుంది బాధగా. వంశీ చిన్నతనం నించి తెలిసినవాడు, బుద్ధిమంతుడు. అతన్ని చేసుకుంటే రత్న సుఖపడుతుంది ... ఎంత డబ్బున్నా కుసుమ జీవితంలోకి సుఖం తేలేను కదా ... కళ్ళు తుడుచుకొని హాల్లోని సోఫా కుషన్స్ మార్చసాగారు ఆవిడ.

మేడమీద గదిని వంశీ కొరకు సిద్ధపరుస్తున్నది కుసుమ. ఈ సాయంకాలమే ... ఇంకా కొన్ని గంటల్లో అతను వస్తాడు. కుండీలో పూవులు అందంగా అమరుస్తుంటే లోనికి వచ్చింది రత్న. కుర్చీలో కూర్చొని వారపత్రిక తిరగవేస్తూ అక్కని చూడ సాగింది.

"అక్కా, వంశీ ఎంత మారిపోయి ఉంటాడో! చూసి నాలుగేళ్లయింది. ఇప్పటి ఫాషన్స్ ప్రకారం చెంపలు అవీ పెంచుకొని వస్తాడేమో కదూ!"

నవ్వింది కుసుమ. "అతను అంత త్వరగా మారే మనిషి కాడు రత్నా! ఇంకా స్పేపట్లో వస్తాడుగా చూద్దువుగానివి ... అప్పుడే ఇంత ఆత్రుతా?"

ఇంతలో వాకిట్లో టాక్సీ ఆగిన శబ్దం వినబడగా ఇద్దరూ కిటికీలోనించి బయటకు చూశారు. గేటువద్దకు తండ్రి వడివడిగా వెళ్లటం, టాక్సీలోనించి దిగిన యువకుని ఆలింగనము చేసుకోవటం కనిపించింది.

"అరె! అప్పుడే వచ్చేశాడు!" ఆత్రంగా, ఆశ్చర్యంగా, ఆనందంగా అంది రత్న. కుర్చీలో నించి లేచి క్రిందకి పరుగెత్తింది.

కుసుమకూడా లేచి వెళ్ళబోతూండగా ఏదో ఆలోచన ఆమెను వెనక్కు లాగింది. తను వితంతువు... అపశకునం అంటారు... నమ్మకమున్నా లేకున్నా...ఏదైనా అశుభం జరిగితే తనకే కష్టంగా ఉంటుంది... ఎదురుగా వెళ్ళటం మంచిది కాదు... కళ్ళలో నీళ్ళు తిరిగాయి. ఉత్సాహమంతా చప్పబడగా కుర్చీలో కూలబడింది.

"హల్లో రత్నా!" వంశీమోహన్ చాపిన చేతులని తన చేతుల్లోకి తీసుకుంటూ విప్పారిన వదనంతో అతన్ని చూసింది రత్న.

"వంశీ! 'విక్టరీ' పొంది వచ్చావు!!" ఉత్సాహంగా ఉంది.

అతను నవ్వాడు. అతని నవ్వులో ఏదో వ్యంగ్యం ఉన్నదని జాగ్రత్తగా గమనిస్తే అవి పించక మానదు. రత్న అదేమీ గుర్తించలేదు.

"ఎన్నాళ్లకి రావటం వంశీ! చూసి ఎన్ని ఏళ్ళు గడిచాయి!" మరో సోఫాలో కూర్చుంటూ అన్నది.

"ప్రయాణంతో బడలికగా ఉన్నావేమో— ముందు స్నానంచేసి వస్తావా? కబుర్లకేం, తర్వాత చెప్పుకోవచ్చు" కేశవరావుగారు అన్నారు.


"బంగారంవంటి పిల్లవాడు, పాడు యుద్ధంతో ఎలా నలిగిపోయాడో" అన్నారు సుందరమ్మగారు.

కాఫీ తీసుకొని వచ్చింది కుసుమ.

"థాంక్స్, కుసుమా!" అంటూ అందుకున్నాడు. పలకరింపుగా నవ్వాడు.

సమాధానంగా తిరిగినవ్వి మరో కుర్చీలో కూర్చొని పరిశీలనగా చూడసాగింది అతన్ని. మాసిన గడ్డము, లోతుగా కళ్లు... మునుపటి కళాకాంతులు లేవు అతని ముఖంలో. మనిషి ఎండిపోయినట్లున్నాడు. 'వంశీ,? ఏమిటి ఇట్లా అయిపోయినావు?' బాధగా అనుకుంది. గలగలా ఏదేదో మాట్లాడుతున్న రత్నని, నవ్వుతూ కబుర్లు వింటున్న వంశీని మార్చి మార్చి చూస్తూ 'నా చెల్లి ఆశలు తీరాలి. వీరిద్దరికీ పెళ్లికావాలి' అనుకుంది.

రత్నని మురిపెంగా చూస్తూ కూర్చున్న



కుసుమ అంతా గొల్లున నవ్వటంతో ఉలిక్కి పడింది.

"ఏ లోకంలో ఉన్నావు కుసుమా ? వంశీ ఇప్పటికి మూడుసార్లు పిలిచాడు."

"ఆఁ...ఏమిటి...?" సర్దుకుంటూ అంది.

"అంత మౌనంగా ఉన్నావెందుకు ?' అడిగాడు వంశీ. "ఏమీ కబుర్లు చెప్పవేం?"

"చాలా కాలానికి వచ్చావు... నీవే చెప్పాలి కబుర్లు !"

"కరెక్ట్! ఎంత సేపూ వినటం తప్ప వంశీ మాట్లాడటమే లేదు ! చాలా కబుర్లు చెప్తాడని ఆశగా ఉన్నాను నేను ! అన్నది రత్న.

* * *

కాలం కులాసాగా గడిచిపోతున్నది వంశీమోహన్ కి. సుందరమ్మ, కేశవరావుగార్ల ఆప్యాయత, కుసుమ, రత్న అభిమానం—వీటి నడుమరోజులు హాయిగా గడిచిపోతున్నాయి రత్నకి తన అందచందాలపైన, తెలివి తేటలపైన, అన్నిటికీ మించి తన వ్యక్తిత్వంపైన విశ్వాసం మెండు. చలాకీ కబుర్లతో, హుషా

# ఇంద్ర ధనస్సు

రయిన ప్రవర్తనతో, ప్రతి పనిలోను ఉత్సాహం వెల్లివిరుస్తూ ఆకర్షణ గొల్పుతుంది' 'కుసుమ' అట్లా కాదు. అకాల వైధవ్యం వలన ఆమెజీవితంలో పడ్డ విషాదపు పొర ఆమె ప్రవర్తనలో మార్పు తెచ్చింది. ఎవరితోను ఎక్కువ మాట్లాడదు. వంశీతో అసలే సంభాషణ పెంచదు. అయినా తన పనులన్నీ ప్రచ్ఛన్నంగా ఆమే చేస్తున్నదని గ్రహించాడతడు. ఆమెపెద్దకళ్ళు ప్రపంచాన్ని జాలిగా చూస్తున్నట్లనిపిస్తుంది అతనికి. ఆ కళ్ళల్లోని భావాలు అర్ధం అయి అవకా తికమక పెడుతున్నాయి. ఒక నిమిషం 'ప్రపంచమంతా నాదే' నన్నట్లు అందరినీ ప్రేమగా చూస్తూ మరో నిమిషంలో 'ఇదంతా ఎందుకోసం?' అన్నట్లు వైరాగ్యంగా చూస్తూ ఉండే ఆముఖాన్ని పదే పదే చూడాలనిపిస్తుంది. జీవితంలోని ఒంటరితనం పోవాలంటే ఈమె తోడుకావాలని, తన మనస్సులోని శూన్యాన్ని జయించాలంటే ఈమె మనసు తనది కావాలని, అనిపిస్తుంది. రోజులు గడుస్తున్న కొద్దీ కుసుమతో తన జీవితాన్ని పెనవేసుకోవాలని, ఆమె తనది కావాలని కోరిక అధికమవుతున్నది. అందు వలననే ఒకరాత్రి భోజనాలయినాక కేశవరావు గారు—

"మీ నాన్న నీ గురించి నా పైన ఉంచిన బాధ్యత ఇంకా పూర్తి కాలేదోయ్ ! నీవు త్వరలో వివాహం చేసుకోవాలని మా కోరిక" అన్నప్పుడు,

"నేనూ అదే అనుకుంటున్నాను మామయ్యా! జీవితం కష్టసుఖాలు పంచుకోవటానికి, నాది అనుకోగలిగే వ్యక్తి కావాలి. తోడులేకుండా బ్రతకటం కష్టం కదూ?" అన్నాడు.

"మా రత్నని చేసుకో రాదూ?" నవ్వుతూ అనేశారు ఆయన.

"రత్ననా!?" ఆశ్చర్యంగా అన్నాడు. రత్నంటే తనకి ఇష్టము, అభిమానము

(35 వ పేజీ చూడండి)

జీవితంలో ఆనందాన్ని, ఆహ్లాదాన్ని కలిగించే అనేక మధుర క్షణాలుంటాయి



తలనొప్పి మూలంగా మీ ఆనందాన్ని పాడుచేసుకోవద్దు

2 ఆస్ప్రో తీసుకోండి

మైక్రోఫైన్ ఆస్ప్రో నొప్పిని అతిశీఘ్రంగా తొలగించును

ASPRO
Nicholas

## 21-3-1975 శుక్రవారం మొదలు
## 27-3-1975 గురువారం వరకు

# వారఫలం

—మహేష్—

**మేషం :—** మీ కార్యక్రమాలు చురుకుగా సాగుతాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. మీ మంచితనమే మీకు యిబ్బందిని కలిగిస్తుంది. వారం ఆఖరులో వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి. స్త్రీలకు-ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్యకళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

**వృషభం :—** మీ ఆలోచనలు ఫలిస్తాయి. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. వారం ఆఖరులో సామాన్యమైన పనులకు కూడా యెంతో కృషి చేయవలసి వస్తుంది. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. వినోద కాలక్షేపాలలో పాల్గొంటారు.

**మిధునం :—** వృత్తిలో ఆదాయం బాగుంటుంది. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. ఇతరులతో కలసి చేసే వ్యాపారాలు బాగుంటాయి. ప్రయోజనంగల పరిచయాలు ఏర్పడతాయి. అధికారులవలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. సంతోషకరమైన వార్తలనువింటారు.

**కర్కాటకం:—** మీ కార్యక్రమాల్లో శ్రమ కలుగుతుంది. వృత్తిలో చికాకులు ఏర్పడతాయి. వారం మధ్యలో అన్ని వ్యవహారాలు బాగుంటాయి. ప్రయాణాలు అనుకూలంగా ఉంటాయి వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. మీ తాలూకు వస్తువులుపోయే ప్రమాదం ఉంది.

**సింహం :—** ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. వారంమధ్యలో ప్రయాసకు గురికాగలరు. మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. వారం ఆఖరులో మీ కార్యక్రమాల్లో అనుకూలత లభిస్తుంది. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

**కన్య :—** అన్ని వ్యవహారాల్లోను గౌరవం లభిస్తుంది. ప్రయాణాలు ఫలిస్తాయి. వృత్తిలో నూతనావకాశాలు లభిస్తాయి. సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. వారం ఆఖరులో లాభం రావలసిన వ్యవహారాల్లోనే నష్టం రావచ్చును. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో కార్యభారం పెరుగుతుంది. పుణ్యకార్యాలు చేస్తారు.

**తుల :—** నూతన విషయాలను తెల్సుకొంటారు. వ్యాపారంలో ఆదాయం పెరుగుతుంది. నూతన వ్యవహారాలు బాగుంటాయి. మున్ముందు ఉపయోగించగల సంభాషణలను జరుపగలరు. మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుంటుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

**వృశ్చికం :—** మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. ప్రయాణాల్లో శ్రమకలుగుతుంది. వారం మధ్యలో మీ కార్యక్రమాలు బాగుంటాయి. ప్రయాణాలు ఫలించగలవు. వ్యాపారంలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాల్లో శ్రమకలుగుతుంది, పోటీ వారితో గౌరవం లభిస్తుంది.

**ధనుస్సు :—** రావలసిన డబ్బు అందుతుంది. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. వారం మధ్యలో ఆందోళనకు గురి కాగలరు. వృత్తిలో ఎవరినీ విశేషంగా నమ్మడం తగదు. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు—ఆరోగ్యం బాగుండదు. ప్రయాణాలోచనలు చేస్తారు.

**మకరం :—** వ్యాపారంలో పోటీవారిపోటీ పెరుగుతుంది. పుణ్యకార్యాలు చేస్తారు. ప్రయాణాలు ఫలిస్తాయి. ప్రయోజనంగల సంభాషణలను జరుపగలరు. వారం ఆఖరులో మీరు వెనుకకు తగ్గడమే మంచిదికాగలదు. స్త్రీలకు—కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. ఆడంబరంకోసం వ్యయం చేస్తారు.

**కుంభం :—** మీ కార్యక్రమాలు నిరాటంకంగా నెరవేరతాయి. నూతన విషయాలను తెల్సుకొంటారు. పోటీవారితో మాట పట్టింపులు తగవు. వృత్తిలో శ్రమమీద అనుకూలత లభిస్తుంది. వారం ఆఖరులో మీ ఆలోచనలు ఫలిస్తాయి. స్త్రీలకు— ఆరోగ్యం బాగుంటుంది. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

**మీనం :—** ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. నూతన వ్యవహారాలు బాగుంటాయి. వ్యాపారంలో మీ ప్రయత్నాలు ఫలిస్తాయి. వారం ఆఖరులో అనవసరమైన సందేహాలు కలుగుతాయి. స్త్రీలకు—దైవకార్యాలు నెరవేరతాయి. వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు.

---

## ఇంద్ర ధనస్సు

(16 వ పేజీ తరువాయి)

ఉన్నాయి. కాని అన్నకి చెల్లెలిపట్లకాని, ఒక మిత్రుడికి మరో మిత్రుడిపట్ల కాని ఉండే భావానికి మించి మరేమీలేదు. మెల్లిగాజవాబు చెప్పాడు.

"నాకు కుసుమని చేసుకోవాలని ఉంది'

"కుసుమా?" ఈ సారి ఆశ్చర్యపోవటం కేశవరావుగారి వంతయింది.

"అవును మామయ్యా! ఎందుకో రత్నని భార్యగా ఊహించుకోలేక పోతున్నాను. నాకు కావలసింది కుసుమ. రత్నకి మరొక సంబంధం చూసి చేయవచ్చును. కుసుమ ఇష్టపడుతుందో లేదో ముందు తెలుసుకుంటే ..."

అప్పటికి ఆశ్చర్యంనించి కొంత తేరుకున్నారాయన. "వంశీ!" ఆనందం స్ఫుటమయింది ఆయన స్వరంలో. "కుసుమ జీవితంలో మళ్ళీ వసంతం వస్తుందనుకోలేదు నేను! ఒకసారి పెళ్ళయిన పిల్లని మరెవరు చేసుకుంటారని బాధపడ్డాను. ఈ వయస్సుకే విరాగిణిలాగా తయారయింది. ఇంతకుమించి నాకేం కావాలి ... నీవన్నట్టే రత్నకి మరొక సంబంధం చూద్దాం."

"మీకు ఇష్టమే కనుక, ఇక కుసుమని అడగవలసిఉంది. మామయ్యా, తనని నేనే అడుగుదామనుకుంటున్నాను."

"అలాగే! నీవే అడుగు" ఒక నిమిషం ఆగి అన్నారాయన "కుసుమపట్ల జాలితో నీవు ఈ నిర్ణయానికి రాలేదు కదా?"

వంశీ నవ్వాడు "జాలి కలిగితే కేవలం జాలి చూపిస్తాను! సానుభూతి ప్రకటిస్తాను! అంతేకాని పెళ్ళి చేసుకోవాలనుకుంటానా మామయ్యా? నేను కుసుమని ప్రేమిస్తున్నాను ..." మనస్సులోని భావం మాట రూపంలో బయటికి రావటంతో ఎంతో తేలికగా, హాయిగా అనిపించింది అతనికి.

మర్నాడు చీకటితోనే లేచాడు వంశీమోహన్. చల్లని నీటితో స్నానం చేస్తుంటే శరీరానికి, మనసుకికూడా హాయి అనిపించింది. కుసుమని వెతుకుతూ తోటలోనికి నడిచాడు. పారిజాతం చెట్టుకింద పూవులు ఏరుతూ కనిపించింది. మబ్బురంగు చీర కట్టుకున్నది తలంటి పోసుకున్నదేమో, నిడుపాటి జుట్టుని జడ అల్లుకోకుండా వదిలేసింది. ఇంకా

### చిట్కాలు

అమ్మాయిలూ మీజుట్టు లొంగటం లేదా అయితే ముందుకు వొంగి తల వొంచి జుట్టంతా మొహంమీద నుంచి క్రిందకి వ్రేలాడదీసి శుభ్రంగా ముందుకి ఓ యాభైసార్లు దువ్వండి ఆ తర్వాత వెనక్కి తల విసిరి మామూలుగా దువ్వుకోండి! అణిగి మణిగి వొత్తుగా వుంటుంది మీ కేశ సంపద!

దేహపుష్టికి
ఆరోగ్యానికి
పండిత-డి.గోపాలాచార్యులవారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్)లిమిటెడ్
మదరాసు-17

సుఖదాంపత్య జీవితం పొందండి



నపుంసకత్వము, శుక్ల నష్టము, శీఘ్రస్ఖలనము, ప్రత్యేక సుఖ వ్యాధులకు ఉత్తమ చికిత్స.
సంప్రదించండి.
డా॥ రాయ్
(Govet Regd) Sex Specialist
ఉదయం 8 నుండి 1—00 వరకు,
సాయంత్రం 4 నుండి రాత్రి 9—30వరకు.
రాయ్ మెడికల్ హాల్,
గాంధినగర్, అలంకార్ టాకీస్ ఎదుట,
విజయవాడ-3, Phone : 74658.

**WHEN NATURE FAILS**

H New Super eight మరింతఎత్తు,పొడుగు కాగలరు (2నుండి 8అం. వరకు పూచి)
For Super Heightness
మీరు పొడుగు పెరగ దలచుకుంటే ప్రపంచప్రఖ్యాతి పొందిన మా హైటెక్స్ HYTEX ఔషధాన్ని వాడండి. వయోపరిమితిలేదు. స్త్రీలు, పురుషులు కూడా పుచ్చుకోవచ్చు. HYTEX is a great **name and meant for popular people.** వెల: బుడ్డి 1 కి (20 Tabs) Rs. 3-75. పోస్టేజి అదనం. 3 Phails (60 Tabs) Rs. 11-25. Postage free.

**SCIENCE HAS SOLVED THE PROBLEMS**

STOP GREY HAIR పిన్నవారుగా అగుపించండి. మీరు పిన్న వారైనట్లే మీకుఅనిపిస్తుంది. (Feel) Unobtainable anywhere else in the world. సంవత్సరాలుగా జరిపిన పరిశోధన ఫలితమైన బాల్ కాలా తేల్ BAL KALA TEL Brilliantine Hair Colour అద్భుతముగ తెల్లజుట్టును శాశ్వతంగా వేళ్ల నుంచి నల్లబడేట్లు చేస్తుంది. వెల: బుడ్డి 1కి Rs. 3 cnly. పోస్టేజి అదనం. 3బుడ్లు Rs. 7-50 పోస్టేజి ఉచితం. తల తెల్లగాగాని, రంగువేసినట్లుగాని అగుపించదు. షరా: ఉత్తరాలుఇంగ్లీషులో వ్రాయండి.

**M/S. VICTORIA COMMERCIAL COY, A.M.W. (3/75) Flat Door No. 3883X, Beat No. 1, Ambala Cantt-133001 (N.I.)**

# ఇంద్ర ధనుస్సు

సూర్యోదయం కాలేదు. అయినా తూర్పు దిక్కున ఆకాశం ఉషః కాంతులతో గులాబి రంగులో మెరిసిపోతున్నది. శరీరాన్ని చల్లగాలి స్పృశిస్తుంటే ఎంతో ఉల్లాసంగా ఉన్నది.

"కుసుమా!"

ఉలిక్కిపడి వెనుదిరిగి చూసింది కుసుమ. రోజూ చూసే వంశీ మోహన్ క్రొత్తగా కనిపించాడు ఈ ఉదయం. ముఖంలో ఎంతో సంతోషం! ఏమిటో విశేషం?

"కుసుమా! రాత్రి మామయ్యతో మాట్లాడాను. ఆయనకి ఏమీ అభ్యంతరం లేదన్నారు. పైగా ఎంతో ఆనందించారు!" ఉత్సాహంగా అన్నాడు.

దేనికి అభ్యంతరం లేనిది? ఏమిటి చెప్తున్నాడితను? జరగకూడనిది జరిగినట్లుగా మనసంతా వికలమయిపోయింది. అయోమయంగా చూసింది అతని వైపు.

"అలా చూస్తావెందుకు? నీవు కాదనవు కదూ? చెప్పు కుసుమా, నేనంటే ఇష్టమని చెప్పు!"

"ఏమిటీ మాటలు? నీవంటే నాకు ఎప్పుడూ ఇష్టమే, వంశీ. రత్నని, నిన్ను భార్యాభర్తలుగా చూడాలని నా కోరిక."

"కుసుమా, నీవు నా భార్యవి కావాలి" ఆమె మాటలు విననట్లే అన్నాడు.

నమ్మలేనట్లు చూసింది కుసుమ.

"నాకు యిదివరకే పెళ్ళయింది తెలుసా?" మెల్లిగా అంది.

"తెలుసు! నీకు రాజారావుతో పెళ్ళికి ముందు పరిచయం లేదనీ తెలుసు! పెళ్ళయినరాత్రే అతనికి జరిగిన ప్రమాదం గురించీ తెలుసు! కుసుమా అమాయకంగా మాట్లాడకు. అతను నీ మనస్సులోని ఏ సున్నితపు పొరలనీ స్పృశించక ముందే, మీ యిద్దరి మధ్యా ఏ అనుబంధమూ పెరగక ముందే అతను పోయాడు ... నాకు నీవు కావాలి!"

"రత్న నీపైన ఆశలు పెట్టుకుంది. నీవు ఆమెని పెళ్ళి చేసుకోవాలి."

"రత్న స్వభావమే అంత! నాలా స్నేహపాత్రురాలు. ఎవరన్నా అభిమానంగానే ఉంటుంది. నాపట్లతను చూపుతున్న ఆప్యాయతని నీవు అపార్థం చేసుకుంటున్నావేమో!"

"లేదు వంశీ! రత్న స్వభావం నీకంటే నాకు బాగాతెలుసు. నిన్ను పెళ్ళి చేసుకోవాలని దాని ఆరాటం ... మనిద్దరికీ పెళ్ళి ఏమిటి-?" నవ్వుతూ తేల్చేసింది. "మీరిద్దరూ కలసి కలకాలం సుఖంగా ఉండాలి." పైకి తేలికగా నవ్వినా మనసులోని కలవరపాటుని కన్నులు చెప్పకనే చెప్తున్నాయి.

చేతిలోని పూల సజ్జవైపే చూపులు నిలిపి. శిరీష వృక్షాన్ని ఆనుకొని నిలబడ్డ ఆమెని చూస్తూ వుండిపోయాడతను. అనుకోని ఆమె ధోరణి అతన్ని తికమక పెడుతున్నది. ఆ అయోమయావస్థలోను స్పష్టంగా తెలుస్తున్న విషయం ఒక్కటే – 'ఈమెని నేను ప్రేమిస్తున్నాను...ఈమె లేకపోతే నా జీవితానికి అర్థంలేదు.'

"నేనంటే ఏమాత్రం ప్రేమ లేదా, కుసుమా?" మమతలు. అనుబంధాలు ఎంత బాధని ఇవ్వగలవో తెలుస్తున్నది.

ఆమె మాట్లాడలేదు.

"ఒక్కమాట చెప్పు, నేనంటే ప్రేమ లేదని! నిన్ను ఆట్టే విసిగించకుండా వెళ్ళిపోతాను."

దుఃఖంతో మాట పెగలటంలేదు ఆమెకి. ఎలాగో కష్టపడి అన్నది – "కోరుకున్నది జరగకపోవటమనేది రత్న జీవితంలో ఎన్నడూ జరగలేదు. నీవంటే ప్రాణం పెడుతుంది. ఇటువంటి దెబ్బని తట్టుకోలేదు. తనని చేసుకొని సుఖపెట్టాలి నీవు."

"అది సాధ్యమేననుకుంటున్నావా? రత్నని చేసుకున్నా మనస్సు సదా నిన్నే వాంఛిస్తుంటే నేను కాని, తనుకాని సుఖపడగలమా?"

"వంశీ, ఇటువంటి మాటలు నీవు అనకూడదు. నేను వినకూడదు?"

"నాకు పిచ్చి ఎక్కేటట్లుంది కుసుమా! నన్నేం చేయమంటావు? అసాధ్యమయినది అడుగుతున్నావు"

'నీవన్నట్లే మనిద్దరం పెళ్ళి చేసుకుంటే – రత్న ఆశలన్నీ పడగొట్టానే, ఆమె కోరినది నేను పొందానే అనే ఆలోచన నాలో ఎప్పుడూ నిలిచి, నాకు శాంతి లేకుండా చేస్తుంది. చెల్లెలి దుఃఖమనే పునాదిమీద నా సంసారపు మేడని నిలుపుకోగలనా? అది సాధ్యమేనా? వంశీ!"

[ఇంకావుంది]

"ఏదో పేద వాళ్లింట్లో పెళ్ళిలాగా నిరాడంబరంగా జరిగితే చూస్తూ ఊరుకోగల్గిన ఓర్పు 'మీ బావకు కట్నం ఎంతరా' అని మా ఫ్రెండ్స్ అడిగితే 'మా బావ ఆదర్శ పురుషుడోయ్! అందుకని కట్నం తీసుకోలేను!' అని చెప్పుకోగలిగే వుదారత నాలో లేదు! నాకీ పెళ్ళి అసలిష్టంలేదు!" అని తన అభిప్రాయాన్ని వ్యక్తం చేసి బయటకు వెళ్ళిపోయాడు అన్నయ్య.

నిస్సహాయంగా నా వంక చూసే నాన్నకు ఏ బదులూ యివ్వలేక వుబికి వచ్చే కన్నీటిని ఆపుకుంటూ నిశ్శబ్దంగా నా గదిలోకి వెళ్ళిపోయాను.

మూఢ నమ్మకాల బామ్మ...

మూర్ఖపు పట్టుదల గల్గిన అమ్మ...

వేష భాషలలో మాత్రమే ఆధునికత గల్గిన అన్నయ్య...

వీళ్ళని ఎదిరించి నేను పొందలేని వ్యక్తిని జయ పొందుతున్నదని తెలిసినప్పుడు. ఆ వ్యక్తి విలువ మరెన్నో రెట్లు పెరిగినట్లనిపించింది నాకు నిశ్చయంగా ఇది అసూయ కాదు... ఆదర్శాన్ని అర్థం చేసుకోలేని పెద్దల నిర్ణయాన్ని ఎదిరించలేని నా అశక్తత...!

"అమ్మాయ్! ఇంకా మేడమీద ఏం చేస్తున్నావ్? చీకటిపడినా లైటు వేసుకోలేదూ? త్వరగా భోజనానికి రారాదూ, మీ అన్నయ్య, నాన్నగారూ వచ్చేసరికి పొద్దు పోవచ్చు..!" అమ్మ పిలుపుతో ఆలోచనలను అవతలకు నెట్టివేస్తుంటే నా ఒళ్ళోంచి జారిపడ్డాయి జయ వెడ్డింగ్ కార్డు, శరత్ 'దేవదాసు'. ఎన్నిసార్లు చదివినా ఆ పుస్తకంలో చైతన్యవంతంగా అనిపించే ఒకే ఒక్క వాక్యం: "నీ పాదాల వద్ద నాకింత చోటియ్య దేవదా!" అన్న పార్వతి మాటలు గుర్తుకు వచ్చాయి కానీ, ధైర్యంగా ఆ చేయి అందుకోలేని దేవదాసు, తన జీవితం అంతా పరితపించినా తిరిగి ఆ అవకాశాన్ని పొందలేక పోయాడు. ప్రతి మనిషి తన జీవితంలో ఒక్కసారి మాత్రమే అదృష్టంగా వెతుక్కుంటూ వచ్చే అవకాశాన్ని చేజారవిడుచుకుంటే అదే మరోకరి చేతచిక్కి, మరింత విలువను సంతరించుకొని, మనం పోగొట్టుకున్న దాని విలువ ఎంతో కొట్టొచ్చినట్లు వ్యక్తపరుస్తుంది. ఈ ఆలోచనే ముందుంటే ...' కళ్ళల్లో నిలిచిన నీటి తెరలు చూపుకు అడ్డంనిలిచి, నా చుట్టూ చీకటిని మరింత చిక్కంగా చేశాయి.

# ఇంద్రధనస్సు

శ్యామల

*[గత సంచిక తరువాయి]*

తల పగిలిపోతున్నట్లున్నది అతనికి. "నేను కావాలని నీవంటే అనురాగం పెంచుకోలేదు నాకు తెలియకుండానే ఈ భావం పెరిగి నా హృదయమంతా నిండిపోయింది నీవు కోరి వచ్చి రత్నని పెళ్లిచేసుకొని-నీపట్ల ప్రేమని మర్చిపోయి-నన్ను నేనే మోసం చేసుకొని - మా యిద్దరికీ శాంతి లేకుండా చేయమంటావా? నీవే చెప్పు!"

నిశ్శబ్దంగా దొర్లాయి కొన్ని నిమిషాలు.

"అన్నీ ఆలోచించి నీవే చెప్పు కుసుమా, ఏం చేయమంటావో అట్లాగే చేస్తాను." ఈసారి అతని స్వరంలో ఆవేశంలేదు నిరాశ నిస్పృహ, అంతకుమించిన బాధ ఉన్నాయి

ఒక్క నిమిషం ఆగి ఆమె చెప్పింది. ఆమె స్వరం నిశ్చలంగా, ఏ భావమూ వ్యక్తం చేయకుండా ఉన్నది "ఒక్కొకసారి సహజంగా మొలకెత్తిన భావానికి తలఒగ్గడమే మంచిదనిపిస్తుంది కాని ఆవిధంగా చేయటంవలన మరోవ్యక్తి మనసు తూట్లు పడుతుందనకుంటే, అట్లా చేయరాదనీ అనిపిస్తుంది ప్రేమాభిమానాలు మనోధారఢ్యాన్ని ఇంతగ పరీక్షించగలవని ఇప్పుడే తెలుస్తున్నది! నేను నిన్నెపుడూ రత్న భర్తగానే ఊహించాను ఆనందించాను. కాని వంశీ, నీవు వచ్చిన ఈ నెల రోజుల్లో నాకు ఏమయిందో నాకే తెలియటంలేదు. ఎప్పుడో తెలియకుండా హృదయంలో ఒక బీజం పడింది. అది మొలకెత్తి ప్రమాన్నై ఇంతటి తపన, ఇంతటి ఆరాటం కలిగిస్తున్నది. ప్లీజ్... వంశీ నాకు చేయూతని ఇవ్వు... మనిద్దరం ఈ ప్రేమని జయించాలి. మరొక వ్యక్తిని బాధించరాదు."

బరువుగా ఊపిరి తీసుకొని అన్నాడతను "నీవు అడిగినది ఏదీ కాదనలేను." అప్రయత్నంగానే ఆమె భుజాలపైనున్న అతని చేతులు ఆమె చెక్కిళ్లపైకి జరిగాయి. తన చేతుల్లో ఉన్న ఆమె ముఖాన్ని దగ్గరకు తీసుకొని ఆ లోతైన నల్లని కళ్లలోకి ప్రేమగా చూశాడు వాటిల్లో నీరు నిండివుంది. కన్నీటితోపాటు ఉన్న ఏదో కాంతి అతన్ని చూపులు మరల్చుకోనివ్వటంలేదు ఆమె బుగ్గల్లోనించి చెప్పని ఆవిర్లు చిమ్ముతున్నాయి పరిసరాలని మరచి తదేకంగా

## ఇంటింటి చిట్కాలు

* కర్పూరం ఆవిరి గాకుండా భద్రపరచాలంటే కర్పూరపు డబ్బాలో కాస్త బియ్యంగాని, నాలుగు మిరియాలు గాని వేసి యుంచండి
* ఫ్లాస్కులో కాఫీ వేడిగా ఉండాలంటే ఫ్లాస్కునిండా కాఫీ పోసి వుంచాలి
* వేడిపాలనే ఫ్లాస్కులో ఉంచుకోవాలి చల్లని పాలయితే విరిగిపోతాయి
* కాయగూరలలో విటమిన్లు నశించక ఉండాలంటే ముక్కలను పెద్దవిగా తరుగాలి!

— శ్రీమతి ఎస్. భువనేశ్వరమ్మ.

'జీవితమే ఒక నాటకరంగం' ... 'జీవితమే ఒకపాటైతే
మీరు ఆడుతు పాడుతు సాగాలి!
తాతినేని చలపతిరావు
సంగీత స్వరాలు
కలకాలం మీ నోట పలికే
ఆనందగీతాలు
వినండి!
శ్రీలక్ష్మీ వారి
దేవుడు చేసిన పెళ్లిలో

FREE! ఉచితం!

# అనుకరణ

అమెరికా దేశములో పేరు గాంచిన వ్యాపారస్థుడు, దేశ నాయకుడు 'వెబాక్సటన్' ఆయన చెప్పిన మాటలు ఇవి "1952—1953" ఏ సంవత్సరములో నేను నా పట్టణములో Mayorగ పని చేస్తున్నప్పుడు 2400 మంది నేరస్థులను నేను విచారించాను. అందులో ఎవ్వరైన ఆదివారపు బడులకు (దేవుని గూర్చి బోధించే బడులకు) దేవాలయములోని ఆరాధనలకు క్రమంగా వెళ్లినవారుంటే వారి కోసం నేను జుల్మాన చెల్లిస్తానని వారితో సవాలు చేసాడు. "ఎప్పుడో ఒక్కప్పుడు వెళ్ళుచుండే వారమండి, ఇప్పుడు లేదు. మమ్ములను వదలి పెట్టితే వెళ్ళుటకు ప్రయత్నిస్తామండి" అని పలికిన వారే గాని, దైవారాధనలకు ఆదివారపు బడులకు క్రమంగవెళ్లినవారు ఆ 2400 మందిలో ఏ ఒక్కరూ లేరు"

ఈ మాటలవలన దైవారాధనలు ఆదివారపు బడులకు దేశములో నేరాలను తగ్గించుటకు తోడ్పడుచున్నవని చెప్పుటకు సందేహము లేదు. దేవాలయములో ఆరాధించుటకు వచ్చే వారంత రక్షణ పొందిన భక్తాగ్రేసరులని కాదు గాని ప్రార్థన, ఆరాధన, సంకీర్తన, సత్సహవాసం, సద్బోధ, పసిపిల్లల పసి హృదయాలను దైవ స్వరూపములో రూపొందించుటకు తోడ్పడగలవని నిస్సందేహముగ చెప్ప వచ్చు. ఎవ్వరో అన్నారు. "ఈ విత్తనం వెయ్యి రెట్లుగ ఫలించుటకు దీనిని ఎక్కడ విత్తాలి?" ఆ ప్రశ్నకు ప్రభు బదులిచ్చాడు. "నా కోసం ఈ విత్తనమును పసిపాప హృదయములోవిత్తుము" అని పెద్దవారిని అనుకరించటం పిల్లలకు అలవాటు. అసభ్యకరమైన సినీమాలు, ఉద్రేకాలను రెచ్చగొట్టే సినీమాలు సమాజములో యెంతటి పరిణామాన్ని తీసుకొని వస్తున్నాయో వీటిని చూచిన మనుష్యులు ఎంత దిగజారి పోతున్నారో వీటిని చూచి ఎంతమందికి చెడు అలవాట్లు అలవడుతున్నారో తెలిసి కూడ, ఎంతో మంది తల్లితండ్రులు తమ చిన్న పెద్ద పిల్లలందర్ని వెంట బెట్టుకొని సినీమాలకు వెళ్ళుతుంటారు. పిల్లల బాగోగులను గుర్తించి వాటికి దూరంగ ఉండటం తల్లి తండ్రులకు అసాధ్యమైనప్పుడు పిల్లలకు మట్టుకు అది సాధ్యమవుతుందా ? బుద్ధి తెలిసిన తల్లితండ్రులకు లేని నిగ్రహం పిల్లలకు మట్టుకు ఎలా వస్తుంది. ఇంక అందులో చూచిన దృశ్యాలను పిల్లలు అనుకరిస్తున్నారని వారిని గద్దించటం బుద్ధి హీనత, తల్లితండ్రులు సినీమాలకు షికార్లకు వెళ్తితే పిల్లలు వెంబడిస్తారు లేక వారు దైవ సన్నిధిలో జంటగ కూర్చొని సత్కీర్తనలు పాడుతూ దైవాన్ని ప్రార్థిస్తే వారుకూడ వారి చిన్ని హస్తాలను వంచి చేతులు జోడించి దైవాన్ని ప్రార్థిస్తారు.

బూతు బొమ్మలతో కూడిన అసభ్యకరమైన సాహిత్యాన్ని, బీరువాలో దాచుకొని పఠించే తల్లి తండ్రులున్నారు. సినీమాలకు, గుర్రపు పందాలకు, క్లబ్బులకు వెళ్లే తల్లులున్నారు. ఇంక పిల్లలను మట్టుకు ముక్కు మూసుకుని జపం చేస్తూ కూర్చోమంటె వారు కూర్చోగలరా? ఏనుగు గూర్చి వెయ్యి పుస్తకాలు చదివి వినిపించిన ఒక బ్రతికియున్న ఏనుగును చూచి పిల్లలు ఎక్కువగా నేర్చుకోగలరు. మన బోధలకన్న పిల్లల యెదుట మన నడత చాలా ముఖ్యం. "బాలుడు నడవ వలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు పెద్ద వాడైనప్పుడును దానినుండి తొలగిపోడు" బైబిల్లో వ్రాయబడియున్నది. దానిని మీరు చదివారా?

— చదలవాడ చంద్రమతీదేవి.


| ఉచితం | ఉచితం |
| --- | --- |
| మీ ఇంట్లో కూర్చుని బైబిల్ పరిశోధనమీద చక్కటి సర్టిఫికెట్ పొందాలన్నా, బైబిల్‌కి సంబంధించిన అందమైన విలువగల పుస్తకములు కావాలన్నా ఒక కార్డు మీద మీపూర్తి అడ్రసుతో స్పష్టంగా వ్రాయండి. పోస్టు ఖర్చులుకూడా మావే. HOPE. | ఇదీ అడ్రసు : ఎస్. జాన్ డేవిడ్, నిరీక్షణ, పోస్టుబాక్సు నెం : 12, చిలకలూరిపేట, (గుంటూరుజిల్లా) A.M.G. |

The Gospel Message Inserted by Mr. S. John David, Nireekshana, Post Box No: 12, Chilakaluripet, For A.M.G.Through M/s. Hope Advertising & Public Relations, Swamy Street, Gandhinagar, Vijayawada-520003.


## ఇంద్రధనస్సు

ఆమెని చూస్తుంటే ఇంతవరకు జరిగినదంతా కలవలె తోచింది. యుద్ధము, దుఃఖము, ప్రేమ, తిరస్కృతి — అంతా అసత్యమే. ఎదురుగా — జగతి అంతా నిండినట్లున్న ఈ ముద్దులమోము ఒకటే వాస్తవం. ఆమె వణుకుతున్న ఎర్రని పెదిమలపై మందు తున్న తన పెదిమలని ఉంచి గాఢంగా హత్తుకున్నాడు.

చెవికి శంఖాన్ని అనించుకుంటే వినవచ్చే సముద్రపు హోరు తనను ముంచెత్తుతున్నట్లనిపించింది ఆమెకి. ఆ హోరు నడుమనే తన గుండె అతి వేగంగా కొట్టుకుంటున్న శబ్దమూ వినిపించసాగింది. ఆమె శరీరం అతనిలో కరిగిపోతున్నట్లవగా వారికి కాలమే స్తంభించింది.

హఠాత్తుగా స్పృహ వచ్చినట యిందామెకి ఏమిటిదంతా? అయోమయంగా చూసిందతని వైపు, ఆ మూపు అతన్ని తట్టి లేపింది. చటుక్కున ఆమెని వదిలి దూరంగా జరిగాడు. ఒక్క క్షణం ఆగి అన్నాడు.

"క్షమించు! ఇంకెప్పుడూ ఇట్లా జరగదు!" వెనుదిరిగి చూడకుండా వడివడిగా నడుస్తూ వెళ్లిపోయాడతను.

నిలబడటానికి కూడా శక్తి లేనట్లనిపించిందామెకి. పెనుగాలిలో ఆకువలె శరీరమంతా కంపిస్తుండగా చెట్టు మొదట్లో కూలబడిపోయింది.

ఉదయమే వాహ్యాళికై తోటలోనికి వచ్చి, అప్రయత్నంగానే ఈ సంభాషణ అంతా ఆలకించి, కళ్లు తుడుచుకుంటూ వెళ్ళిపోయిన మూడో వ్యక్తిని వాళ్లిద్దరూ గమనించనే లేదు.

* * *

ఆ సాయంకాలం తలనెప్పిగా ఉన్నదంటూ తనగదిలో పడుకున్న కుసుమవద్దకు వచ్చింది రత్న.

"అక్కా! మరేమో...నాకు ఓ సాయం చేయవూ?" తన మామూలు ధోరణిలో అడిగింది.

ఏమిటన్నట్లు చూసింది కుసుమ.

"నాన్నగారు నన్ను పెళ్లి చేసుకోమని పంశీని అడుగుతారేమో ... నా కయితే అతన్ని చేసుకోవాలని లేదు !"

విస్మయంతో కుసుమ కళ్లు విప్పారాయి. గమనించనట్లే చెప్పింది రత్న — "నాకు

ఎం. ఎ. చదవాలని ఉంది. ఆ పైన రిసెర్చి చేయాలని ఎంతో కోరికగా ఉంది. అది కూడా అయినాక ఆలోచిస్తాను పెళ్ళి సంగతి. అక్కా ! నాన్నగారికి చెప్పి ప్రస్తుతానికి పెళ్ళి ప్రయత్నాలు వాయిదా పడేటట్లు చూడవూ? వంశీకి మరో అమ్మాయిని చూడమను ! చదువయినాక నాకు ఇంకొక సంబంధం దొరక్కపోదు !''

''రత్నా !'' అప్పటికి మాట పెగిలింది కుసుమకి ''ఇంత అకస్మాత్తుగా నీ అభిప్రాయం ఎందుకు మారింది ?''

''అకస్మాత్తుగా ఏమీ కాదక్కా ! చాలా రోజుల నించి ఎం. ఎ. చదవాలనే కోరికఉంది. ఆ కోరిక ఇప్పుడు బలవడింది! ప్రస్తుతానికి పెళ్ళి మీద మనసు లేదు''

కుసుమ లేచికూర్చుంది. ''నీ ఇష్ట ప్రకారమే చేద్దాం రత్నా !'' హఠాత్తుగా చెల్లెలిని కౌగలించుకుంది ''నీవు కోరుకున్న చదువు అయిపోయినాకే చక్కటి వరుడిని వెతుకుదాం. నా రత్నానికి తగిన వరుడు ఎప్పుడయినా దొరుకుతాడు...రత్నా...అయితే నీవు వంశీని ప్రేమించలేదా ?''

ఫక్కున నవ్వింది రత్న. ''వంశీని ప్రేమించటమా ? లేదక్కా! స్నేహితుడిగా అభిమానించాను. అంతే !''

''నేను నాన్నగారితో ఇప్పుడే మాట్లాడి వస్తాను!'' గది బయటకు నడిచింది కుసుమ. ఆమె ముఖం ఆనందంతో వెలిగిపోవటం గమనించక పోలేదు రత్న. బల్లమీదికి తల వాలుస్తూ అనుకుంది – 'నా ప్రేమకోసం మీ యిద్దరి సుఖాన్ని కాదనే హక్కు... అంతస్వార్థం... నాకు లేవక్కా! ఈ గాయం మానదని, ఎన్నటికీ పెళ్లి చేసుకోనని నేనను కోవటంలేదు. కాని మానేదెన్నటికో !? నేనే ఒక రత్నాన్ని, నాకేం తక్కువ అనుకున్నాను. కాని రత్నం కేవలం అలంకారప్రాయం ! మనోల్లాసం కలిగించేది కుసుమ పరాగమే !'

దూరంగా కుసుమ నవ్వు, వంశీమోహన్ మాటలు వినవచ్చాయి. ఎండ, వాన కలిసి వచ్చినపుడు అగుపించే ఇంద్రధనస్సువలె, రత్న ముఖంలో కన్నీళ్ల మధ్యలోనే చిరునవ్వు విరిసింది – ఏదో తృప్తితో !

ప్రేమకు
ఎక్కువతక్కువలు లేవని-
ప్రేమ ప్రేమకోసమేనని చెప్పె
పంతులమ్మ
పోష్టుమేన్ల
పెళ్లికె నారితీసిన
ప్రేమకథ!
దేవుడు చేసిన పెళ్లి

